
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 5 ఏప్రిల్ 2024



నడినెత్తిన ఎండ.. నడవలేని పరిస్థితి.. అయినా కాళ్లీడ్చుకుంటూ సచివాలయాలకు వెళ్లిన వృద్ధులు, దివ్యాంగులకు రెండోరోజు గురువారం కూడా పెన్షన్ల పంపిణీలో సచివాలయాల సిబ్బంది చుక్కలు చూపించారు. డబ్బు రాలేదంటూ మధ్యాహ్నం వరకూ అలాగే కూర్చోబెట్టి, సరిగ్గా భోజన సమయంలో క్యూల్లో నిలబెట్టి పండుటాకులను ఇబ్బందులు పెట్టారు. సరైన సౌకర్యాలు లేక, సత్తువ రాక ముదుసలులు నానా అగచాట్లు పడ్డారు.



కంచికచర్ల టౌన్‌లో మండుటెండలో క్యూలో కిక్కిరిసిన వృద్ధులు

ఎండగట్టారు..!

పెన్షన్ల పంపిణీలో వృద్ధులు, దివ్యాంగులకు ఎండదెబ్బ

- రెండోరోజూ బ్యాంకుల నుంచి ఆలస్యంగా వచ్చిన డబ్బు
- మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఎండలోనే వృద్ధులు
- భోజన సమయంలో హడావిడిగా పంపిణీ
- క్యూలో నిలబడే సత్తువ లేక ముదుసలుల నరకయాతన
- బందరు మండలంలో ఇంటి వద్ద 75ఏళ్ల వృద్ధుడు మృతి
- ప్రతిపక్షాల వల్లేనని పేర్ని కిట్టూ వ్యాఖ్యలు.. వివాదం



వీరులపాడు మండలం జుజ్జూరు సచివాలయంలో వృద్ధుల పడిగాపులు



యనమలకుదురు సచివాలయంలో ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల /మచిలీపట్నం) : పెన్షన్ల పంపిణీలో రెండోరోజు గురువారం కూడా రెండు జిల్లాల్లో హైడ్రామా నడిచింది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం వరకు బ్యాంకుల నుంచి డబ్బు రాలేదు. దీంతో పంపిణీ ప్రక్రియ మధ్యాహ్నం నుంచే చేపట్టారు. తొలిరోజు రద్దీగా ఉంటుందని పింఛన్లు తీసుకోవటానికి రానివారు గురువారం భారీగా గ్రామ సచివాలయాలకు వచ్చారు. తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, విజయవాడలోని మూడు నియోజకవర్గాల్లో మధ్యాహ్నం 12-1 గంటల మధ్య పింఛన్ల పంపిణీ చేపట్టారు. నందిగామ నియోజకవర్గంలో 2 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఉదయం నుంచి వచ్చిన వృద్ధులు సచివాలయాల్లోనే పడిగాపులు పడ్డారు. టెంట్ల కింద కూర్చున్నారు. గురువారం ఎండ వేడి ఎక్కువగా ఉండటంతో వృద్ధులు అల్లాడిపోయారు. వీరులపాడు మండలం జుజ్జూరులో టెంట్ల కింద వృద్ధులు పడిగాపులు పడ్డారు. మైలవరం, తిరువూరు, గంపలగూడెం, జి.కొండూరు, పెనుగంచిప్రోలులోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఇంటికి వెళ్లిపోదామనుకున్న వృద్ధులను వెళ్లనివ్వలేదు. ఇదిగో డబ్బులు వచ్చేస్తున్నాయంటూ మభ్య పెట్టారు. అప్పటికి వృద్ధులు భోజన సమయం కూడా కావటంతో ఇబ్బందులు పడ్డారు. రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల వృద్ధులను క్యూలో వచ్చి పెన్షన్లు తీసుకోవాలని సూచించారు. సచివాలయాలకు తలుపులు వేసి పోలీసులను కాపలా పెట్టారు. సచివాలయ సిబ్బంది ఫ్యాన్ల కింద కూర్చుని పెన్షన్లు ఇస్తుంటే, బయట వృద్ధులు మాత్రం క్యూలో ఎండలో నిలబడాల్సి వచ్చింది. కంచికచర్ల టౌన్‌లోని సచివాలయంలోనూ ఇదే పరిస్థితి. గురువారం రాత్రి 7 గంటలకు ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 90 శాతం పెన్షన్లు పూర్తిచేశారు. ఇంకా 40 వేల మంది వృద్ధులకు ఇవ్వాల్సి ఉంది. వీరికి శుక్రవారం అందజేస్తారు.

వృద్ధుడు మృతి.. పేర్ని కిట్టూ రాజకీయం

బందరు మండలం కోన గ్రామానికి చెందిన వెంకట కృష్ణారావు (75) కొద్దిరోజులుగా రుద్రవరంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. నాలుగు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ మంచానికే పరిమితమయ్యాడు. పింఛన్ తీసుకోకుండానే ఆయన గురువారం ఉదయం మరణించాడు. రుద్రవరం వెళ్లిన వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టూ.. ప్రతిపక్ష నాయకుల కారణంగానే పింఛన్లు ఇవ్వడంలో జాప్యం జరిగిందని, అందుకే వెంకట కృష్ణారావు మరణించాడని ఆరోపించడం వివాదాస్పదమైంది.

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లాలో 2,44,262 మంది సామాజిక పింఛన్‌దారులు ఉండగా, గురువారం నాటికి 2,11,394 మందికి అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. 88 శాతం మందికి పింఛన్లు అందజేశామని, ఈ నెల 6 వరకు మిగిలిన వారికి ఇస్తామన్నారు. జిల్లాలో రూ.72.14 కోట్లు అందజేయాల్సి ఉండగా, గురువారం సాయంత్రానికి రూ.68.87 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేస్తామని, అయినా ఇంకా మిగిలి ఉంటే, మరికొన్ని రోజులు గడువు పొడిగిస్తామని పేర్కొన్నారు.

కొత్త కలెక్టర్ డీకే బాలాజీ

కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు



కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కలెక్టర్ (జిల్లా ఎన్నికల అధికారి)గా డీకే బాలాజీని నియమిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన పి.రాజాబాబును ఎన్నికల కమిషన్ బదిలీ చేయడంతో బాలాజీ నియామకం జరిగింది. బాలాజీ 2016లో కృష్ణాజిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. 2022లో జిల్లా విభజన జరగ్గా కృష్ణా కలెక్టర్‌గా రంజిత్‌బాషా ఏడాది పాటు పనిచేశారు. 2023, ఏప్రిల్ 15న కలెక్టర్‌గా పి.రాజాబాబు నియమితులయ్యారు. మూడు రోజుల క్రితం ఆయన బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లా విభజన జరిగిన మూడో సంవత్సరం ప్రారంభం రోజే జిల్లాకు మూడో కలెక్టర్‌గా డీకే బాలాజీ నియమితులు కావడం గమనార్హం. బెంగళూరుకు చెందిన డీకే బాలాజీ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఐఏఎస్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించారు. గతంలో ఈయన కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు.

మరణంలోనూ ఒక్కటిగా..

- లంకపల్లి వద్ద రోడ్డు ప్రమాదం
- భార్యాభర్తలు దుర్మరణం



ఘటనాస్థలిలో దాసరి విజయ్ కుమార్, బేబీ సరోజిని మృతదేహాలు

ఘంటసాల, ఏప్రిల్ 4 : ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు మృతిచెందిన విషాద సంఘటన గురువారం తెల్లవారుజామున మండల పరిధిలోని లంకపల్లిలోని జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లపల్లి మండలం మాజేరు శివారు పచ్చార్లంకకు చెందిన దాసరి నాగేశ్వరరావు-సరోజిని దంపతులు ద్విచక్ర వాహనంపై గురువారం తెల్లవారుజామున చల్లపల్లిలో జరిగే ఓ కార్యక్రమానికి బయల్దేరారు. ఈ క్రమంలో లంకపల్లి వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో వారిద్దరూ కిందపడిపోయి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఇద్దరి మృతదేహాలను అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో పచ్చార్లంక గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుమారుడు దాసరి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఘంటసాల ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సెగభగలు

ఏప్రిల్‌లోనే మే నెలను మించిన ఎండలు

- విజయవాడలో 40 డిగ్రీలను తాకిన ఉష్ణోగ్రతలు
- ఈవారంలో మరింత పెరిగే అవకాశం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మే నెలకు ముందే భానుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఏప్రిల్ రెండో వారంలోనే వరుసగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాస్తవానికి ఏప్రిల్ మూడో వారం నుంచి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ఉంటుంది. ఈ ఏడాది అది ముందే కనిపించడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం ఒకేలా ఉండగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి రహదారులు నిర్మానుష్యంగా కనిపి స్తున్నాయి. వాహనదారులు సైతం రహదారులపై తిరగడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఏప్రిల్‌లోనే ఉష్ణోగ్రతలు అల్లాడిస్తుంటే, మేలో పరిస్థితి ఇంకెంత భయంకరంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

40 డిగ్రీలు దాటి..

మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకుతున్నాయి. విజయవాడలో గురువారం 40.01 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీనికి ముందు నమోదైన ఉష్ణోగ్రతలు ఈస్థాయిలోనే ఉన్నాయి. ఈ పరిస్థితికి అనేక కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. విజయవాడకు చుట్టుపక్కల రాతి కొండలు ఉండటం, నగరంలో పచ్చదనం లేకపోవ డమే అంటున్నారు. ఈ ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల వరకూ నమోదవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈనెల 5న 42.79, 6న 42.18, 7న 40.69, 8న 40.13, 9న 40.05, 10న 39.95 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు ఫోర్‌కాస్ట్ విడుదల చేశారు. ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండాలని సూచిస్తున్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-25 (శుక్ర)
సహర్ (ఉదయం) : 4-39 (శని)

వీడిన ఉత్కంఠ

అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా బుద్ధప్రసాద్

- పవన్ కల్యాణ్ ప్రకటనతో మిన్నంటిన సంబరాలు





మోపిదేవి ప్రధాన కూడలిలో టపాసులు కాలుస్తున్న జనసైనికులు

అవనిగడ్డ, ఏప్రిల్ 4 : అవనిగడ్డ జనసేన పార్టీ అభ్యర్థి ఎవరన్న ఉత్కంఠకు తెరపడింది. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌నే అవనిగడ్డ జనసేన అభ్యర్థిగా ప్రకటిస్తూ అధినేత పవన్ కల్యాణ్ తరఫున ఆ పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ గురువారం ప్రకటన విడుదల చేశారు. దీంతో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లోని టీడీపీ, జనసేన శ్రేణులు వీధుల్లోకి వచ్చి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

45 రోజులుగా..

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా ఫిబ్రవరి 24న విడుదల చేసిన అభ్యర్థుల తొలి జాబితాలో అవనిగడ్డకు స్థానం లభించలేదు. దీంతో అవనిగడ్డ నుంచి టీడీపీ పోటీ చేస్తుందా? లేక జనసేన పోటీ చేస్తుందా? అనే చర్చ జరిగింది. అనంతరం అవనిగడ్డ సీటును జనసేనకే కేటాయించినట్లుగా పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థిగా ఎవరు నిలబడతారోననే చర్చ జరిగింది. జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, ప్రముఖ కాంట్రాక్టర్ విక్కుర్తి శ్రీనివాసరావు, న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, అక్షయ డెవలపర్స్ అధినేత మాదివాడ వెంకటకృష్ణ, రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు తదితరుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఐవీఆర్ఎస్ సర్వే పోల్ నిర్వహించగా, అందులో విక్కుర్తి శ్రీనివాస్ వైపు ఎక్కువ మంది మొగ్గు చూపారు. దాదాపు విక్కుర్తి శ్రీనివాస్‌కే సీటు ఖరారవుతుందని అందరూ భావించారు. అనూహ్యంగా గత నెల 30వ తేదీన మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు జనసేన పార్టీ నుంచి ఆహ్వానం అందింది. ఆ తర్వాత ఆయన పిఠాపురంలో పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. కాగా, టీడీపీ నుంచి వచ్చిన బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వటానికి వీల్లేదంటూ రెండు రోజుల పాటు జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మూకుమ్మడి రాజీనామాల హెచ్చరికలు జారీ చేయటంతో ఏం జరుగుతుందోనని అందరూ భావించారు.

- మిగతా 6లో



కృత్తివెన్నులో పూర్తిగా ఎండిపోయిన మంచినీటి చెరువు

తీరంలో తీరని దాహార్తి

- కృత్తివెన్ను మండలంలో అడుగంటిన చెరువులు
- తాగునీరు లేక అవస్థలు పడుతున్న స్థానికులు

కుళాయిల ద్వారా పనికిరాని నీటి సరఫరా

కృత్తివెన్ను : కృత్తివెన్ను మండలంలో మంచినీటి సమస్య తీవ్రంగా మారింది. మంచినీటి చెరువులు అడుగంటాయి. నీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ముందుచూపు లేకపోవటం వల్ల నీటి తిప్పలు తారస్థాయికి చేరాయి. ఇప్పటికే మండలంలో చాలావరకు మంచినీటి చెరువులు ఎండిపోగా, మిగిలిన చెరువుల్లో నీరు అడుగంటి, రంగుమారి, దుర్వాసన వస్తోంది. ఆ కలుషిత నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తుంటే, కనీసం పశువులు తాగేందుకు కూడా ఉపయోగపడట్లేదని, స్నానం చేసేందుకు కూడా పనికిరాకుండా ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెగా రక్షిత మంచినీటి చెరువు కూడా అడుగంటిపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. ఈ నీటిని కూడా పొదుపుగా, కేవలం కొన్ని గ్రామాలకే వదులుతుండటంతో ప్రజలు దాహార్తితో అల్లాడిపోతున్నారు. తక్షణమే కాల్వలకు నీరు వదిలి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



సంగమూడిలో కుళాయి నుంచి వచ్చిన రంగుమారిన మంచినీరు

అడుగంటుతున్న మంచినీటి చెరువులు

సంగమూడి, యండపల్లి, లక్ష్మీపురం గ్రామాలతో పాటు దాదాపు అన్ని గ్రామాల్లోనూ మంచినీటి చెరువులు పూర్తిగా అడుగంటిపోయాయి. మండలంలో అందరికీ నీరందించే 50 ఎకరాల మెగా చెరువులోని నీరు సైతం అడుగంటిపోయింది. వేసవి మొదట్లోనే మండలంలో నీటి నిల్వలు తగ్గిపోవటం, కొన్ని గ్రామాల్లో ఇప్పటికే నీటి సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. అధికారులకు ముందుచూపు లేకపోవటమే ఇందుకు కారణమని స్థానికులు మండిపడుతున్నారు. కాల్వలకు నీరు వచ్చిన సమయంలో మండలంలోని అన్ని చెరువులు నింపుకోవాలని ఉన్నతాధికారులు సూచించినా.. కలెక్టరే మండలంలో పర్యటించి ఆరా తీసినా స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు. చెరువులు పూర్తిస్థాయిలో నింపామని, నీటి ఎద్దడే ఉండదని తప్పుదోవ పట్టించారే తప్ప చెరువులను పూర్తిస్థాయిలో నింపలేకపోయారు. దీంతో వేసవి సమీపించకముందే చెరువులన్నీ అడుగంటి ఎండిపోయాయి. దీంతో ప్రజలు నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో తాగేందుకే కాదు కదా.. కనీసం వాడుకునేందుకు కూడా నీరు లేకుండాపోయింది. తక్షణమే కాల్వలకు నీరు విడుదల చేసి, తమను ఆదుకోవాలని కృత్తివెన్ను మండలవాసులు కోరుతున్నారు.


హైకోర్టు న్యాయమూర్తులకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

వన్‌టౌన్, ఏప్రిల్ 4 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ రెడ్డి, జస్టిస్ మన్మథరావులు దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.


సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో పూజలు చేస్తున్న జనసైనికులు

పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని పూజలు

మోపిదేవి, ఏప్రిల్ 4 : తీవ్ర జ్వరంతో బాధపడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుట పడాలని పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన జనసైనికులు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్ తదితరులు ఉన్నారు.

పార్టీ నిర్ణయం మేరకు పనిచేస్తాం

అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకనుగుణంగా ఆయన సూచించిన అభ్యర్థి విజయానికి కట్టుబడి పని చేస్తామని మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్ తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భాగంగా జనసేన పార్టీ తరపున మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించటంపై జనసైనికులు హర్షం వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు.


బార్ కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న హజరత్తయ్య గుప్తా

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

- బార్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, రాజా
- నూతన కార్యవర్గసభ్యుల ప్రమాణ స్వీకారం

విజయవాడ లీగల్, ఏప్రిల్ 4 : బెజవాడ బార్ అసోసియేషన్ 2024-25 నూతన కార్యవర్గసభ్యులతో బార్ అసోసియేషన్ హాలులో గురువారం బార్ మాజీ అధ్యక్షుడు వేములు హజరత్తయ్య గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బార్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్ (రాజా) మాట్లాడుతూ, న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వేసవి దృష్ట్యా ప్రతి కోర్టు హాలు వద్ద కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి చల్లని తాగునీరు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. బార్ ఉపాధ్యక్షుడు జీవీ రామశర్మ, జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతికుమార్‌లు మాట్లాడుతూ, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారుల ద్విచక్రవాహనాలు, కార్లు, కోర్టు ఆవరణలో ఒక క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్, మాజీ బార్ అధ్యక్షులు చేకూరి శ్రీపతి, వి.గురునాథం, వెన్నా రమేష్‌చంద్రబాబు, కేబీ సుందర్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు ప్రజాగళం సభా స్థలిని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

పామర్రులో బాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పామర్రు/ఉయ్యూరు, ఏప్రిల్ 4 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈనెల 7న పామర్రులో నిర్వహించనున్న 'ప్రజాగళం' నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు టీడీపీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. హెలిప్యాడ్‌కు బందరురోడ్డులోని తాడిశెట్టి సాంబశివరావుకు చెందిన స్థలం ఎంపిక చేశారు. నాలుగు రోడ్ల కూడలి సమీపంలో 'ప్రజాగళం' సభ ఏర్పాట్లను టీడీపీ నేతలు కొనకళ్ల నారాయణ, వర్లకుమార్‌రాజా ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, జనసేన పామర్రు ఇన్‌చార్జి తాడిశెట్టి నరేశ్‌లు గురువారం సాయంత్రం పరిశీలించారు. వర్లకుమార్‌రాజా మాట్లాడుతూ, చంద్రబాబు పామర్రు పర్యటనను పార్టీశ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ విభాగం నేత వీరంకి వెంకట గురుమూర్తి, మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీటు రాకున్నా నియోజకవర్గ ప్రజల వెంటే..

- విక్కుర్తి శ్రీనివాస్ బహిరంగ లేఖ



అవనిగడ్డ, ఏప్రిల్ 4 : 'ఇక్కడే పుట్టి పెరిగి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే ఆశతో వచ్చా.. ఆఖరి నిముషంలో సీటు వేరే వారికి వెళ్లినా నైతికంగా ప్రజల మద్దతు మాత్రం నాకే ఉంది.. నాకు అండగా నిలిచిన జనసేన, టీడీపీ శ్రేణులకు కృతజ్ఞతలు..' అంటూ అవనిగడ్డ నుంచి జనసేన పార్టీ అభ్యర్థిత్వం ఆశించిన విక్కుర్తి శ్రీనివాస్ గురువారం నియోజకవర్గ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. సీటు రాకున్నా ఓ నాయకుడి నిజ రూపాన్ని బయటపెట్టగలిగామని, ఆరుశాతం ఓట్లు లేవన్న పార్టీలోకి ఆయనను వచ్చేలా చేయగలిగామని.. అదే పెద్ద విజయమని, రాబోయే రోజుల్లో ఎవరికి ఏ సమస్య వచ్చినా ప్రజలకు అండగా ఉంటానని పేర్కొంటూ ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలను ఆయన లేఖలో ప్రస్తావించారు. ఈ లేఖ ప్రస్తుతం నియోజకవర్గంలో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

జనసేన పార్టీ పదవికి రాయపూడి రాజీనామా



అవనిగడ్డ, ఏప్రిల్ 4 : గడిచిన కొద్ది రోజులుగా అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థిత్వంలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు గురువారం మధ్యాహ్నం తన పదవికి రాజీనామా చేశారు. జనసేన పార్టీలో కష్టపడిన వారికే సీటు ఇవ్వాలని కోరుతూ వచ్చిన రాయపూడి వేణుగోపాలరావు బుద్ధప్రసాద్‌కు జనసేన పార్టీ అభ్యర్థిత్వం ప్రకటించిన కొద్దిసేపటికే రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించి జిల్లా పార్టీ అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ ద్వారా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు పంపించారు. శుక్రవారం తదుపరి కార్యచరణ ప్రకటిస్తానని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాజిల్లా జనసేన, టీడీపీల సమన్వయ కమిటీ సభ్యులు, సీనియర్ జనసేన నేత చెన్నగిరి సత్యనారాయణ, అవనిగడ్డ పట్టణ ప్రధాన ఏనుబాబులు కూడా తమ పదవులకు రాజీనామా చేసి జిల్లా పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణద్వారా లేఖలు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు పంపించారు.

రైల్వేలో అనర్హులకు అందలం!

- సమర్థులు ఉన్నా దక్కని గుర్తింపు
- కేసులపై సస్పెండ్ అయిన వారికి ప్రాధాన్యం
- పీసీసీఎం అవార్డుల ఎంపికపై దుమారం

ఆదాయంలో రికార్డులు సృష్టిస్తున్న విజయవాడ రైల్వే డివిజన్.. అందుకు కారణమైన వారిని గుర్తించటంలో పక్షపాత ధోరణి అవలంబిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా పీసీసీఎం అవార్డుల్లో రాజకీయాలు నడిచాయన్న తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రైల్వే ప్రతిష్ఠాత్మక అవార్డులను కొందరు తమ స్వార్థం కోసం బోర్డును అప్రతిష్టపాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైల్వే ప్రతిష్టకు భంగం కలిగించే వారికి విజయవాడ స్పోర్ట్స్ స్క్వాడ్ తరపున పీసీసీఎం అవార్డు దక్కగా.. మెరుగైన ప్రతిభ కనబరిచిన వారున్నా గుర్తించకపోవడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



విజయవాడ స్పోర్ట్స్ స్క్వాడ్‌లో కె.నరేంద్ర (టీటీఐ) అత్యుత్తమ ప్రతిభ చూపి బృంద తనిఖీల్లో మొత్తంగా రూ.40.95 లక్షల ఆదాయాన్ని రైల్వేకు సాధించి పెట్టారు. ఆ తర్వాతి స్థానంలో ఎస్‌కే మస్తానయ్య (టీటీఐ) రూ. 39.41 లక్షల ఆదాయాన్ని సాధించి పెట్టారు. మూడో స్థానంలో డి.వెంకటేశ్వర్లు రూ.38.91 లక్షల ఆదాయాన్ని సాధించారు. వీరిలో కె.నరేంద్రకు న్యాయంగా అవార్డు దక్కాల్సి ఉండగా.. మూడో స్థానంలో ఉన్న డి.వెంకటేశ్వర్లుకు అవార్డుకు ఎంపికచేయడం గమనార్హం. పీసీసీఎం అవార్డుకు ఎంపిక చేసిన వెంకటేశ్వర్లు గతంలో పలుమార్లు సస్పెండ్ అయ్యారు. ఇతర రాష్ట్రాల ప్రయాణికుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసిన ఉదంతాలు ఉండగా.. ఇతడిపై ఓ ప్రయాణికుడు బోర్డుకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపించి అతడిపై సస్పెండ్ వేటు వేసింది. గతంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో డబ్బులు తీసుకుని రైలు దిగి వెళ్లిపోవడంతో రైలు మూడు గంటల పాటు విజయవాడ స్టేషన్‌లో నిలిచిపోయింది. అప్పట్లో ఇది సంచలనమైంది. ఆ సంఘటనతో అతడు సస్పెండ్ అయినా.. మళ్లీ అదే పోస్టులోకి రావడం గమనార్హం. ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేసి మళ్లీ సస్పెండ్ అయ్యాడు. సస్పెండ్ అయిన వ్యక్తి తిరిగి మళ్లీ అదే పోస్టుకు రావటంలో కమర్షియల్ విభాగంలోని అవినీతి కోటరీలే కారణంగా తెలుస్తోంది.

పీసీసీఎం అవార్డులు అంటే..

రైల్వేలో వివిధ స్థాయిల్లో ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులను ప్రోత్సహించేందుకు వివిధ అవార్డులు జారీ చేస్తుంటారు. రైల్వేబోర్డు అవార్డులు, జోన్ స్థాయిలో జీఎం అవార్డులు ఉంటాయి. ఆ తర్వాత ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) అవార్డులు ఉంటాయి. ఇవి కాకుండా శాఖల వారీగా అవార్డులు జారీ చేస్తుంటారు. పీసీసీఎం అవార్డులు కమర్షియల్ విభాగానికి సంబంధించి ముఖ్యమైనవి. తాజాగా ఈ అవార్డులు విజయవాడ డివిజన్ పరిధిలోని స్క్వాడ్ టీమ్స్‌లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి ఇచ్చారు. విజయవాడ డివిజన్ పరిధిలో నెల్లూరు, ఒంగోలు, తుని, రాజమండ్రి, భీమవరం, గుడివాడ, విజయవాడ సెక్షన్లలో స్క్వాడ్ టీమ్‌లు పనిచేస్తుంటాయి. పై సెక్షన్లలో ఒక్క విజయవాడ తప్ప అన్నింట్లో ఒక్కొక్క స్క్వాడ్ టీమ్ పనిచేస్తుంది. విజయవాడ సెక్షన్‌లో మాత్రం సీటీఐ, జనరల్, స్పోర్ట్స్, సీనియర్ డీసీఎం వంటి స్క్వాడ్స్‌తో పాటు మహిళలతో పనిచేసే తేజస్విని, కృష్ణా స్క్వాడ్స్ ఉన్నాయి. విజయవాడ సెక్షన్‌లో స్పోర్ట్స్ స్క్వాడ్‌కు సంబంధించి అవార్డు ఎంపికలో మరక పడింది.

కమర్షియల్ విభాగంలో కోటరీలు

కమర్షియల్ విభాగంలో సీనియర్ డీసీఎంకు తెలియకుండా కొన్ని అవినీతి కోటరీలు పనిచేస్తున్నాయి. వాస్తవాలు ఉన్నతాధికారుల దృష్టికి రాకుండా ఈ కోటరీలు పనిచేస్తున్నాయి. విజయవాడ డివిజన్ రూ.5614.13 కోట్ల ఆదాయం సాధించిందంటే సీనియర్ డీసీఎం ప్రణాళికలు, ఆయన విశేష కృషి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఈ కృషిని బూడిదలో పోసిన పన్నీరులా అవినీతి కోటరీలు తెర వెనుక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కోటరీల లీల వల్లనే బెజవాడ రైల్వేలో అవినీతిపరులు రెచ్చిపోతున్నారు. ఈ కోటరీలు జోక్యం చేసుకోని అంశాలు లేవంటే అతిశయోక్తి కాదు. చివరికి అవార్డులను కూడా భ్రష్టు పట్టించే పరిస్థితి ఏర్పడింది.

బాబుతోనే యువతకు ఉపాధి

- ఉద్యోగాల కల్పనే తక్షణ కర్తవ్యం
- కేశినేని శివనాథ్ (చిన్ని)


కేశినేని చిన్ని, కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌ల సమక్షంలో టీడీపీలో చేరిన యువత

విద్యాధరపురం, ఏప్రిల్ 4 : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రథమ కర్తవ్యంగా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, చిన్నిల సమక్షంలో భవానీపురం 45వ డివిజన్ సితార సెంటర్‌కు చెందిన నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలో చేరారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గ యువతలో మార్పు మొదలైందన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లు యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పనే ధ్యేయంగా కృషి చేస్తారని, ఉద్యోగాలు వచ్చేంతవరకు నిరుద్యోగులకు ప్రతినెల రూ.3వేల భృతి ఇస్తారన్నారు. పట్టాభిరామ్ మాట్లాడుతూ, శివనాథ్ సేవా కార్యక్రమాలకు ఆకర్షితులైన యువత పెద్దఎత్తున పార్టీలోకి వస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడాలంటే చంద్రబాబు నాయుడు సీఎం కావాల్సిన అవశ్యకత ఉందన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, మైనార్టీ నాయకుడు ఫతావుల్లా, వాణిజ్య విభాగం నాయకుడు సోలంకి రాజు, 45వ డివిజన్ యూత్ లీడర్ నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితో జగన్‌కు ఓటమి తప్పదు



పాయకాపురం : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో సీఎం జగన్‌కు ఓటమి తథ్యమని కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. 64వ డివిజన్ కండ్రికలో గురువారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్నది చంద్రన్న పాలన అని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే 50 ఏళ్లు నిండిన బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4 వేలు పింఛన్ అందజేస్తారని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, పరుచూరి ప్రసాద్, విజయవాడ పార్లమెంట్ నాయిబ్రాహ్మణ అధ్యక్షుడు సూరవరపు నాగరాజు, పార్లమెంట్ ఎస్సీసెల్ సభ్యుడు వింజరమూరి సతీష్, దాసరి కనకారావు, పలగాని శివ, తదితరులు పాల్గొన్నారు.

బాబుపై భరోసాతోనే భారీగా చేరికలు


వైసీపీ శ్రేణులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్, బాలశౌరి

పెనమలూరు, ఏప్రిల్4 : వైసీపీ రాక్షస పాలనతో విసుగెత్తిపోయిన రాష్ట్ర యువత చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై నమ్మకంతో టీడీపీలోకి వలసలు వస్తున్నారని కూటమి అభ్యర్థులు వల్లభనేని బాలశౌరి, బోడె ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పోరంకి బీజేఆర్‌నగర్ వైసీపీ నేతలు యెడ్లూరి శౌరిబాబు, బండెల్ల చంటి, రవి, పరిమి మోసెయ్య తదితరులు కుటుంబాలతో టీడీపీలో చేరారు. రాష్ట్ర భవిష్యత్తును సర్వ నాశనం చేసిన సైకో జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకొన్న యువత వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నుంచి ఇరవై కుటుంబాలు టీడీపీలో చేరాయి. బోడెప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, వీరంకి కుటుంబరావులు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మేము సైతం..

'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, గడప గడపలో మేము సైతం' కార్యక్రమంలో భాగంగా గురువారం 16వ డివిజన్‌లో పరాశుపేటలో మాజీమంత్రి కొల్లు రవీంద్ర, జనసేన ఇన్‌చార్జి బండిరామకృష్ణ ఇంటింటికీ పర్యటించారు. పరాసుపేటలో టీ దుకాణాల వద్ద సరదాగా కాసేపు టీ అమ్మారు. **మచిలీపట్నం టౌన్**


దొండపాడులో ఎన్నికల ప్రచారంలో వెనిగండ్ల రాము

దొండపాడులో వెనిగండ్ల ప్రచారం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 4 : ప్రజా సమస్యలు పట్టని ఎమ్మెల్యే కొడాలి నాని బూతులు తిట్టడమే అలవాటుగా మార్చుకున్నారని గుడివాడ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. గురువారం దొండపాడులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో రాము మాట్లాడుతూ, దొండపాడు ప్రధాన రహదారికి ఎమ్మెల్యే కొడాలి నాని కనీసం మరమ్మతులు చేయించలేకపోయాడని విమర్శించారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే బూతులు తిట్టడం పరిపాటిగా మారిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేకే తప్పుడు కేసులు

- వైసీపీ నేత వెంపటి

గుడివాడ : రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేకే తనపై తప్పుడు కేసులను పెట్టినట్టు వైసీపీ నేత వెంపటి సైమన్ అన్నారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, పార్టీలో తన ఎదుగుదల ఓర్వలేక తమ సామాజికవర్గానికి చెందిన వేల్పుల నాగబాబు తనపై ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకున్నట్టు తప్పుడు కేసు పెట్టారన్నారు. పోలీసులు విచారణ జరిపి నిజాలను బయటపెట్టాలన్నారు. నాగబాబుపై పరువు నష్టం దావా వేస్తామని వెంపటి హెచ్చరించారు.

వలంటీర్లతో రాజకీయాలకు మేం వ్యతిరేకం : నెట్టెం



జగ్గయ్యపేట, ఏప్రిల్ 4 : వలంటీర్ల వ్యవస్థను టీడీపీ వ్యతిరేకించలేదని, వారితో ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి జగన్ రెడ్డి రాజకీయ ప్రయోజనాలను ఆశించటాన్ని వ్యతిరేకించామని మాజీమంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, జగన్‌రెడ్డికి ప్రజా ప్రయోజనాలు పట్టలేదని, టీడీపీ, ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాకనే ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చిందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఇంటింటికి పెన్షన్లను పంపిణీ చేయిస్తామని చెప్పారు. సమావేశంలో టీడీపీ నేతలు గింజుపల్లి రమేష్, షేక్ సయ్యద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి

- తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత



నాగాయలంక, ఏప్రిల్ 4 : వలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం ప్రభుత్వం వ్యతిరేకం కాదని, రాజకీయాలు చేసే వలంటీర్లకు మాత్రమే టీడీపీ ప్రభుత్వం వ్యతిరేకమని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వలంటీర్లకు రాబోయే ఎన్డీఏ ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందన్నారు. వలంటీర్లను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ నాయకులు రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. పింఛన్ల పంపిణీలో జగన్ ప్రభుత్వం నీచ రాజకీయాలు చేయటం దారుణమన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉప్పల ప్రసాద్, పెన్షన్ దారులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలకు వైసీపీ పేటెంట్ : ఉమా

గొల్లపూడి: శవ రాజకీయాలను వైసీపీ పేటెంట్ హక్కుగా భావిస్తున్నదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడి పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, పింఛన్ మరణాలకు కారణం ముమ్మాటికీ జగన్మోహన్ రెడ్డే అని ఆరోపించారు. వైసీపీ శవ రాజకీయాలకు సీఎస్ జవహర్ రెడ్డి, సెర్ప్ సీఈవో ధనుంజయ్ రెడ్డి, శశి భూషణ్‌లు సహకారం అందించారని మండిపడ్డారు. ఐఏఎస్ చదివింది పండుటాకులపై పగబట్టి వారి చావులు చూసేందుకేనా అని ధ్వజమెత్తారు. ప్రజల సొమ్ము జీతంగా తీసుకుంటున్న సజ్జల రాజకీయాలు ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. వైసీపీ తరపున మాట్లాడాలి అనుకుంటే సలహాదారుని పదవికి రాజీనామా చేసి మాట్లాడాలని డిమాండ్ చేశారు.

వీడిన ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో జ్వరంతో రెండు రోజులుగా హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్ బుధవారం రాత్రి నుంచి పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై కార్యకర్తల అభిప్రాయాలను, స్థానిక గెలుపు అవకాశాలను బేరీజు వేసుకుని గురువారం మధ్యాహ్నం మండలి బుద్ధప్రసాద్ పేరును ఖరారు చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

నియోజకవర్గంలో హర్షాతిరేకాలు

బుద్ధప్రసాద్‌ను జనసేన అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే అవనిగడ్డ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అవనిగడ్డలోని బుద్ధప్రసాద్ ఇంటి వద్ద, కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు టపాసులు కాల్చి సంబరాలు చేయగా, గురువారం సాయంత్రం బుద్ధప్రసాద్ కుమార్ మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్విన్ ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.


పెంజింద్రలో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

కోడ్ అమలులో వివక్ష!

పెంజింద్రలో పంచాయతీ అధికారులు పక్షపాతధోరణి వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎన్నికల నిబంధనల ప్రకారం క్లాత్‌తో మూసివేశారు. విగ్రహానికి సమీపంలో జగన్మోహనరెడ్డి ఫోటోతో ఉన్న ఫెక్సీని మాత్రం వదిలివేయడంతో అధికారుల పక్షపాత వైఖరిని టీడీపీ నేతలు ఖండిస్తున్నారు. - **గుడ్లవల్లేరు**



ఎన్టీఆర్ విగ్రహానికి సమీపాన ఉన్న వైసీపీ ఫ్లెక్సీ

శ్రీరాంపురం సొసైటీ కార్యదర్శిపై ఫిర్యాదు

రెడ్డిగూడెం, ఏప్రిల్ 4 : శ్రీరాంపురం పీఏసీఎస్‌లో రైతుల కట్టిన బకాయి సొమ్ము రూ.30 లక్షలతో ఉడాయించిన కార్యదర్శి విప్రభుదాసుపై కేడీసీసీ బ్యాంక్ అధికారులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. రైతులు రుణాలను సకాలంలో చెల్లించగా మార్చి 31న ఆ సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ప్రభుదాసు పరారయ్యాడని, ఆచూకీ కనిపెట్టి రైతులు సొమ్ము రికవరీ చేయాలని అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సొసైటీ ప్రత్యేకాధికారి జ్యోతిర్మయి, బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, సూపర్ వైజర్ నాగేశ్వరరావుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై యు.గోవింద్ తెలిపారు.

రూ. 7.30 లక్షలు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని చిల్లకల్లులో ఎటువంటి రశీదులు లేకుండా తీసుకెళ్తున్న రూ. 7.30 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. గౌరవరం సమీపంలోని పెట్రోల్ బంకు నుంచి నగదును జగ్గయ్యపేటలో బ్యాంకులో జమ చేసేందుకు తీసుకువస్తున్నట్టు తెలిసింది.


పెడనలోని ఇంట్లో వైసీపీకి చెందిన ప్రచారసామగ్రి

వైసీపీ ప్రచార సామగ్రి స్వాధీనం

మచిలీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పెడన అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాముకు చెందిన ప్రచార సామగ్రిని, పంపిణీకి సిద్ధంగా ఉంచిన చీరలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పెడన నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి పార్టీ కార్యాలయం సమీపంలోని ఒక ఇంటిలో పెద్దఎత్తున ప్రచార సామగ్రి, చీరలను ఉంచారనే సమాచారంతో కలెక్టరేట్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీంతో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణ, అధికారులు, పోలీసులను అక్కడకు పంపారు. ఇంటిలో దాచి ఉంచిన చీరలు, పార్టీబ్యానర్‌లు, బ్యాడ్జీలు, ఇతరత్రా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 57బ్యాగుల్లో ప్రచారసామగ్రి, పార్టీ జెండాలు, ఐదు అట్టపెట్టెల్లో చీరలు, ఉండగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, వీటి వివరాలను నమోదు చేసి త్రీమెన్ కమిటీలో పెట్టి విచారణ చేయడం జరుగుతుందని నియోజకవర్గ ఆర్వో తెలిపారు. బందరు రూరల్ సీఐ పెడన ఎస్ఐ సూర్యశ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు. పెడనలో వైసీపీకి చెందిన ప్రచారసామగ్రి పెద్దమొత్తంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారనే సమాచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

రాజకీయ పరిరక్షణ సదస్సు 7న

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 4: రాజ్యాంగ విలువలకు భంగం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వ చట్ట సవరణ బిల్లుపై అవగాహన కల్పించేందుకు ఈనెల 7న జంక్షన్‌లో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నామని రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక నాయకుడు బేత శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9గంటలకు నిర్వహించే సదస్సుకు ముఖ్యవక్తగా సీఐటీయూ ఆలిండియా నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ హాజరవుతున్నట్లు తెలిపారు. అభ్యుదయవాదులు, లౌకికవాదులు, మేధావులు పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేయాలని బేత శ్రీనివాసరావు కోరారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఉయ్యూరు, ఏప్రిల్ 4: ప్రేమ పెళ్లిని పెద్దలు అంగీకరించరన్న ఉద్దేశంతో ఓ ప్రేమజంట గురువారం ఉయ్యూరు పోలీసులను ఆశ్రయించింది. పట్టణ సీఐ హబీబ్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు, కలువపాములకు చెందిన యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ గురువారం ఓ దేవాలయంలో వివాహం చేసుకుని పెద్దలు అంగీకరించరన్న భయంతో పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇద్దరూ మేజర్లు కావడంతో వారి కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ చేసినట్టు సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్ తెలిపారు.

14 మద్యం సీసాలు స్వాధీనం

ఉయ్యూరు, ఏప్రిల్ 4: గండిగుంట గ్రామ పంచాయతీ పరిధి కాకానినగర్‌లో ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడి నుంచి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఉయ్యూరు పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ తెలిపారు. గురువారం బెల్ట్‌షాపుపై దాడి చేశామని మద్యం స్వాధీనం చేసుకున్నామని, నిర్వాహకుడు బి.శివరాంబాబుపై కేసు నమోదుచేసినట్టు ఆయన తెలిపారు.

7న మెగా వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 4: విజయవాడ రోడ్డులోని కాకాని కల్యాణ మండపంలో ఈనెల 7వ తేదీన పుట్టగుంట సతీశ్‌కుమార్ హెల్త్ ఫౌండేషన్, విజయవాడ ఆస్టర్ రమేష్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రమేష్ ఆస్పత్రి ప్రతినిధి కోనేరు కోటేశ్వరరావు తెలిపారు. శిబిరంలో అన్నిరకాల వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం గన్నవరం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు

వచ్చే ఎన్నికల్లో సీపీఎంకు మద్దతుగా నిలవండి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 4: కార్మికుల పక్షాన పోరాటం చేసే సీపీఎంకు రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని ఆ పార్టీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నూజివీడు రోడ్డులోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద ఆయన కూలీలను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్మిక వర్గం ఓట్లతో గద్దెనెక్కిన నేతలు అధికారంలోకి రాగానే కార్మిక హక్కులను కాలరాసేందుకు చూస్తున్నారని అటువంటి వారికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. నిరంతరం పేదల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే తనను గెలిపించాలని కార్మికులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్, సీపీఎం బాపులపాడు మండల కమిటీ కార్యదర్శి బేత శ్రీనివాసరావు, సీపీఎం, భవన నిర్మాణ సంఘం నాయకులు జె.ఏసుపాదం, కోరం రవి, సీతారామయ్య, చింతా సూరిబాబు, నాగళ్ల శ్రీనివాసరావు, రామచంద్రరావు, బండారు శివ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ పింఛన్ల కోసం

పడిగాపులు

మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ

సచివాలయాల వద్ద నగదు కోసం పింఛన్‌దారుల నిరీక్షణ



యనమలకుదురులో సచివాలయం వద్ద ఆరుబయటే వేచి చూస్తున్న వృద్ధులు



కానూరులో పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

పెనమలూరు, ఏప్రిల్ 4: మండలంలో మొదటి రోజు బుధవారం అరకొర పింఛన్లను పంపిణీ చేసిన ప్రభుత్వం రెండోరోజూ అదే పంథాను కొనసాగించింది. కానూరు, యనమలకుదురు సచివాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధులు ఎండలోనే నిరీక్షించారు. తాడిగడప రెండో సచివాలయం వద్ద ఉదయం పది గంటలకు పింఛన్లు పంపిణీ చేస్తామన్న అధికారుల మాటలు నమ్మి వృద్ధులు వచ్చారు. ఇంకా సొమ్ము బ్యాంకుల నుంచి రాలేదంటూ పన్నెండు గంటల తర్వాత రమ్మని వెనక్కి పంపారు. తిరిగి వెళ్లలేని వృద్ధులు అక్కడే పడిగాపులు కాశారు. యనమలకుదురు 1, 2, 5 సచివాలయాల పరిధిలో ఉదయం ఏడు గంటలకే ప్రారంభించాల్సిన పింఛన్ల పంపిణీ మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ప్రారంభమైంది. ఏడు గంటలకు వచ్చిన వారికి ఎంతకీ పింఛన్లు ఇవ్వకపోవడంతో వారు అధికారులతో వాదనకు దిగారు. దీంతో అధికారులు మీరు ఇళ్లకు వెళ్లి మూడు గంటలకు రావాలని విసుక్కున్నారు. స్థానిక టీడీపీ నాయకులు మొక్కపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు ప్రయత్నించగా అధికారులు ఒప్పుకోలేదు. గంగూరు, చోడవరం గ్రామాల్లో ఏడు గంటలకు ప్రారంభం కావాల్సిన పంపిణీ మధ్యాహ్నం తర్వాతే ప్రారంభమైంది. అడ్మిన్ల ఖాతాలకు పింఛన్ల సొమ్మును ప్రభుత్వం జమ చేయక పోవడమే ప్రధాన కారణమని అధికారులు తెలిపారు.

శివారు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేయాలి



బాపులపాడు ఎంపీడీవో రత్నకుమారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హనుమాన్‌జంక్షన్: పింఛన్ల కోసం పంచాయతీ శివారు గ్రామాల ప్రజలు సచివాలయానికి రాలేక ఇబ్బంది పడుతున్నారని అటువంటి గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పంపిణీ చేయాలని సీపీఎం బాపులపాడు మండల కమిటీ డిమాండ్ చేసింది. గురువారం ఆపార్టీ మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు నేతృత్వంలో ఎంపీడీవో కె.రత్నకుమారికి నాయకులు వినతిపత్రం అందించారు. పంచాయతీకి దూరంగా ఉన్న శివారు గ్రామాల ప్రజలు సచివాలయానికి వెళ్లేందుకు నానా అగచాట్లు పడుతున్నారని ఎంపీడీవోకు తెలియజేశారు. శివారు గ్రామాలకు సిబ్బందిని పంపి పింఛన్లు పంపిణీ చేయాలని కోరారు. సీపీఎం నాయకులు నల్లి ఆంజనేయులు, తోట సాంబశివరావు, రాజనాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 4: "ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం. రాష్ట్ర, దేశ భవిష్యత్తును నిర్ణయించే బలమైన శక్తి ఓటర్లకు మాత్రమే ఉంది. ప్రలోభాలకు లొంగకుండా మీకు నచ్చిన, మీరు మెచ్చిన నాయకుడినే ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు కల్పిస్తోంది. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీసీవో, జిల్లా సహాయ ఎన్నికల నోడల్ ఆఫీసర్ కె.చంద్రశేఖరరెడ్డి సూచించారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో ఉంగుటూరు, ఇందుపల్లి గ్రామాల్లో గురువారం నీ ఓటు - నీ భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఉంగుటూరు స్త్రీశక్తి భవనం సమావేశపు హాలులో గ్రామ సమాఖ్య సంఘాలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో చంద్రశేఖరరెడ్డి మాట్లాడారు. ఓటు వేసేది పార్టీ జెండాలకు కాదని, మన భవిష్యత్తుకు అని ప్రతి ఓటరు గ్రహించాలని ఆయన సూచించారు. నీతి, నిజాయితీతో, నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా స్థానిక అధికారులు, గ్రామ సమాఖ్య సంఘాల ప్రతినిధులు ఓటర్లను చైతన్యవంతం చేయాలని సూచించారు. 18ఏళ్లు నిండి ఓటుహక్కు లేని వారు ఈనెల 15లోగా ఓటర్ కార్డు పొందే అవకాశం ఉందన్నారు. 85ఏళ్లు పైబడిన వృద్ధులు, 40శాతం వైకల్యమున్న దివ్యాంగులు ఇంటి నుంచి ఓటువేయవచ్చునని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుంటామని, ప్రలోభాలకు లొంగబోమని సమాఖ్య సంఘాల మహిళలతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కేడీసీసీ ఉయ్యూరు సబ్‌డివిజనల్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్, క్రాంతిపథం ఏపీఎం ఎం.సాంబశివరావు, ఉంగుటూరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వర్ణలత, సీసీలు ఎన్.వెంకటరత్నకుమారి, టి.విజయలక్ష్మి, ఎన్.మేరీసుమలత, వీవోఏలు పాల్గొన్నారు. ఇందుపల్లి పీఏసీఎస్‌లో ఓటుహక్కు ప్రాధాన్యంపై జరిగిన అవగాహనా సదస్సులో మండల పరిధిలోని కో-ఆపరేటివ్ సొసైటీల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



కంకిపాడులో సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా, గోగినేని తదితరులు



వణుకూరులో బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బోడె హేమ తదితరులు

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్

కంకిపాడు, ఏప్రిల్ 4: "రాష్ట్రం బాగుపడాలన్నా, యువతకు ఉపాధి లభించాలన్నా రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరముందని టీడీపీ-జనసేన-బీజేపీ పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ అన్నారు. పెనమలూరు మండలం వణుకూరులో గురువారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజకీయ పార్టీలు రాజకీయాలు చేస్తాయని, కానీ, జగన్మోహన్‌రెడ్డి చేసేవి హత్యా రాజకీయాలు అని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకటో తేదీన పంపిణీ చేయాల్సిన పింఛన్‌ను 3వ తేదీ సాయంత్రానికి కూడా పంపిణీ చేయకుండా కాలయాపన చేసి పండుటాకుల అవస్థలకు, మృతికి కారణమయ్యారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు సకాలంలో పంపిణీ చేయాలన్నా పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించాలని ప్రజలను ఆమె కోరారు. బోడె వెంకట్‌రామ్, కొమ్మినేని శ్రీనివాసరావు, కాసరనేని కరుణ, సుంకర రమేష్, షేక్ మాబు, బడుగు సాంబశివరావు, పర్వతనేని లక్ష్మీనారాయణ, పులి విజయ్, ఉయ్యూరు మహేష్, కొండేటి విజయ్, నరసింహారావు, సుధీర్ పాల్గొన్నారు. కంకిపాడులో నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గన్నవరం, ఏప్రిల్ 4: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలను పెంచటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీఎన్జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ కొమరగిరి అన్నపూర్ణ పిలుపునిచ్చారు. ఏపీఎన్జీసీ ఆధ్వర్యంలో గన్నవరం, దావాజీగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ఆమె అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. చెట్ల నరికివేతను అరికట్టడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వాడటం, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడంలో అడవుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యా వరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గన్నవరం బాలురు, బాలికల జడ్పీహైస్కూల్, దావాజీగూడెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.రవీంద్ర భవాని, ఝాన్సీ, సునీత, పీఈటీ డి.నాగరాజు, షేక్ మీరాసాహెబ్ పాల్గొన్నారు.



కోడూరుపాడులో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న మూల్పూరి సాయికల్యాణి, కొండపల్లి వెంకన్న, వడ్డిల్లి లక్ష్మి తదితరులు



బుద్దవరంలో లక్ష్మారాయుడు దంపతుల చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

చిరస్మరణీయుడు చింతపల్లి లక్ష్మారాయుడు

గన్నవరం, ఏప్రిల్ 4: ప్రజాసమస్యల పట్ల సత్వరమే స్పందించి పరిష్కారమార్గం చూపటంలో కమ్యూనిస్ట్ ఉద్యమ నాయకుడు చింతపల్లి లక్ష్మారాయుడు ముందుండేవారని, భౌతికంగా ఆయన దూరమైనా చేసిన ఆయన సేవలు చిరకాలం గుర్తుంటాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఆర్.రఘు అన్నారు. లక్ష్మారాయుడు నాలుగో వర్ధంతి సభ గురువారం బుద్ధవరంలోని కల్యాణమండపంలో సీపీఎం నాయకుడు బడుగు మరియదాసు అధ్యక్షతన నిర్వహించారు. లక్ష్మారాయుడు దంపతుల చిత్రపటానికి పూలమాలవేసి రఘు జోహార్లర్పించారు. బుద్ధవరం గ్రామపంచాయతీలో కమ్యూనిస్టులు సుదీర్ఘకాలంపాటు సర్పంచ్‌లుగా పని చేయడంలో, గ్రామ అభివృద్ధిలో లక్ష్మారాయుడి పాత్ర ఉంద న్నారు. గ్రామ పెద్దగా స్థానిక సంస్థలు, సొసైటీ ఎన్నికల్లో గ్రామంలోని ప్రజలం దరినీ ఏకతాటిపైకి లక్ష్మారాయుడు తెచ్చేవారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండా వీరాస్వామి అన్నారు. సీపీఎం మం డల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, కంభంపాటి పాపారావు, కో-ఆప రేటివ్ సొసైటీ అధ్యక్షుడు నక్కా కృష్ణయ్య, మాజీ సర్పంచ్ గండికోట దశర థరామయ్య, గిత్తల సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతి టీడీపీతోనే

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 4: మహిళల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. ఉమామహేశ్వరపురం, కోడూరుపాడు గ్రామాల్లో పార్టీ కమిటీల ఆధ్వర్యంలో ఆమె ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమొచ్చాక ప్రతి ఇంటికీ కలిగే లబ్ధిని ఆమె ప్రజలకు వివరించారు. కూటమి అధికారంలోకి రాగానే ఇంటివద్దకే రూ.4వేల పెన్షన్ అందిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో దాడులు, సహజవనరుల దోపిడీ తప్ప అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ప్రశ్నించిన వారిపై ఆ పార్టీ నేతలు దాడులు చేస్తూ మహిళలకు గౌరవమర్యాదలు ఇవ్వకుండా మానసిక దాడులు చేశారన్నారు. అవ్వతాతల పింఛన్ల పంపిణీని రాజకీయ లబ్ధికి వైసీపీ వాడుకుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా మహిళలకు, రైతులకు, యువతకు అన్ని విధాల లబ్ధి చేకూరుతుందన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రస్తుతం గ్రామంలోని రోడ్లు, డ్రెయినేజీల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు పలకాలని ఆమె ప్రజలను కోరారు. కొండపల్లి వెంకన్న, ఆర్నేపల్లి సూరిబాబు, వడ్డిల్లి లక్ష్మి, షేక్ చాందిని, రెంటపల్లి సునీత, షేక్ చాచి, కొలుసు రమాదేవి, పూడి శివ, గండి అచ్చియ్య, షేక్ నాగుల్, కొలుసు కృష్ణమ్మ, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాల పునఃప్రతిష్ఠకు హాజరైన భక్తులు

ఉయ్యూరు, ఏప్రిల్ 4: ఉయ్యూరులో పునర్నిర్మించిన వేణుగోపాలస్వామి, పంచ పట్టాభిరామస్వామి ఆలయాల్లో స్వామివార్ల విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజ స్తంభాలు, శిఖరముల ప్రతిష్ఠలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదస్వస్తి, గోపూజ, మహా పూర్ణాహుతి హోమం, శాంతి కల్యాణం నిర్వహించారు. పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఉయ్యూరు పట్టణం, పరిసర గ్రామాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ ఆధ్యాత్మిక సందేశమిచ్చారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు



ఆంధ్రజ్యోతి కథనానికి శ్రీపల్లవి స్పందన

పామర్రు, ఏప్రిల్ 4 : నిర్లక్ష్యం నీడన తహసీల్దార్ కార్యాలయం శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి తహసీల్దార్ పి.శ్రీపల్లవి స్పందించారు. ఆమె ప్రత్యేక చొరవ చూపి కార్యాలయ భవనానికి మరమ్మతులు చేయించారు. కూలిన సన్‌సైడ్‌ను పునర్నిర్మించారు. ప్రాంగణం ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు మొక్కలు నాటే కార్యక్రమానికి నాంది పలికారు. తహసీల్దార్ శ్రీపల్లవి తీసుకున్న చర్యల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సిరివెళ్లపాలెంలో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందిస్తున్న టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర


కంకటావలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్


బాలశౌరిని కలిసి బీసీల సమస్యలు వివరిస్తున్న బోసుబాబు


బాలశౌరి సమక్షంలో జనసేనలో చేరుతున్న రామకృష్ణ


ఉమ్మడి అభ్యర్థిగా బుద్ధప్రసాద్ పేరు ప్రకటించడంతో శ్రీకాకుళంలో సంబరాలు

వైసీపీ తుడిచి పెట్టుకుపోవడం ఖాయం

● టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 4 : వైసీపీ తుడిచిపెట్టుకు పోవడం ఖాయమని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలోని 16వ డివిజన్‌లో పరాసుపేటలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఇంటింటికీ పర్యటించారు. పరాసుపేటలో ఒక దుకాణం వద్ద బండి రామకృష్ణ టీ కాయగా కొల్లు రవీంద్ర టీ అమ్మారు. రామానాయుడుపేటలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. జీవితబీమా ఉద్యోగులతో మాట్లాడారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. ఓటు వజ్రాయుధంతో వైసీపీని తరిమి కొట్టాలని రవీంద్ర పిలుపునిచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, వైసీపీ పాలనలో మట్టి దందాలు, దొంగ పట్టాల పంపిణీ చేయడం తప్ప మరేమీ జరగలేదన్నారు. సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్ దింటికుర్తి సుధాకర్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, తెలుగుమహిళ అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

బందరు నగరంతో పాటు బందరు రూరల్ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బందరు మండలం సిరివెళ్లపాలెం, మరిదిబ్బ గ్రామాల్లో గురువారం రాత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. 11 ఏళ్ల దివ్యాంగురాలికి వెంటనే వీల్‌చైర్‌ను ఏర్పాటు చేశారు. రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంకటావలో కృష్ణప్రసాద్ ప్రచారం

పెడన : అరాచక వైసీపీ ప్రభుత్వం అంతమయ్యే ఆసన్నమైందని పెడన నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరు మండలం కంకటావ గ్రామంలో గురువారం ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, పేదల పెన్షన్ల పంపిణీని అడ్డుకుంటున్న జగన్‌కు పేదల ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు. కృష్ణప్రసాద్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సాదరబోయిన ఏడుకొండలు, గోపీ నాగబాబు, ఎన్‌ఏ బేగ్, కాసగాని శ్రీనివాసరావు, మోహనరావు, సిరివెళ్ల శ్రీనివాసరావు, శాయన సోమయ్య, పోతుల రాము తదితర నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడు జనసేనలో చేరిక

పెడన : పట్టణంలోని జయలక్ష్మీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు, వైసీపీ నాయకుడు వరుదు రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. ఎంపీ బాలశౌరి కార్యాలయంలో బాలశౌరి సమక్షంలో రామకృష్ణ తన అనుచరులతో జనసేన పార్టీలో చేరారు. రామకృష్ణ, ఆయన అనుచరులు దాసరి సూర్యనారాయణ, తోట వెంకన్న, వరుదు కొండ, వరుదు వెంకట నారాయణ, వరుదు సాయిలకు బాలశౌరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పట్టణ జనసేన పార్టీ నాయకులు మట్టా శివపావని, కూనపరెడ్డి రంగయ్యనాయుడు, మట్టా నాని తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించండి

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీ, జనసేన మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు కోరారు. బాలశౌరిని గురువారం విజయవాడలో మచిలీపట్నం బీసీ నేతలు కలిశారు. వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయలేదన్నారు.

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం

పెడన : బీసీలను ఆదరించి అక్కున చేర్చుకున్నది తెలుగుదేశం పార్టీయేనని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన పెడన పట్టణ క్లస్టర్ జయహో బీసీ సదస్సు జరిగింది. వేణుగోపాలరావు మాట్లాడుతూ, బీసీలకు టీడీపీ ఇచ్చినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత మరే పార్టీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలు తీవ్ర అణచివేతకు గురయ్యారని ఆయన దుయ్యబట్టారు. జగన్‌పాలనలో బీసీలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు కలత చెందిన చంద్రబాబు వారికి రక్షణ కల్పించాలన్న ఆశయంతో టీడీపీ మేనిఫెస్టోలో బీసీ రక్షణ చట్టం చేర్చడం జరిగిందన్నారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో పరసా సూర్యనారాయణ, బెజవాడ నాగరాజు, బూసం ఆనందరావు, కమ్మగంటి బాబు, యర్రా నాగరాజు, ఎలిగట్ల ప్రసాద్, పరసా జితేంద్ర, బొడ్డు దీక్షానందుడు, హమీదుల్లా, వంకా ప్రసాద్, ఖుర్షిద్ బేగం పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు అవనిగడ్డ సీటుపై టీడీపీ, జనసేన సంబరాలు

ఘంటసాల, ఏప్రిల్ 4 : అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా జనసేన నేత మండలి బుద్ధప్రసాద్ పేరు ప్రకటించటంతో శ్రీకాకుళం కరకట్టపై తాడికొండ చిన్నా, జనసేన యువత ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చారు. తాడికొండ చిన్నా మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ పేరు ప్రకటించటం సంతోషమన్నారు. రానున్న ఎన్నికల్లో అవనిగడ్డలో కూటమి అభ్యర్థి విజయం ఏకపక్షమే అన్నారు. శ్రీకాకుళం, శీలంవారిపాలెం, సూరపనేనివారిపాలెం, వీరమాచినేనిపాలెం, పాపవినాశనం, తెలుగురావుపాలెం గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కోడూరు,** అవనిగడ్డ నియోజకవర్గ సీటు మండలి బుద్ధప్రసాద్‌కి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురువారం ప్రకటించటంతో మండల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కోడూరు ప్రధాన సెంటర్‌లో టపాసుల కాలుస్తూ, మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. మండల అడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఉల్లి శేషగిరిరావు, బీజేపీ నాయకులు దొండపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలి బుద్ధప్రసాద్ భారీ మెజార్టీతో గెలవటం తథ్యమని తెలిపారు. బీసీ నాయకులు కొనకళ్ల జగన్నాథరావు, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, దావు మల్లి, పూతబోయిన శ్రీనివాసరావు, బెల్లంకొండ కూర్మా కోటేశ్వరరావు, వేములపల్లి రాజేష్, మోర్ల మాణిక్యరావు, గోలి సాంబశివరావు, జనసేన నాయకులు ఉల్లి శేషగిరి, దామోర్ల నారాయణ, దామోర్ల రాఘవేంద్ర, నాగం రఘు, రేపల్లె మహేష్, కోట ప్రసాద్, బడే వెంకటస్రశ్వర రావు, బీజేపీ నాయకులు కొండవీటి రామకృష్ణ, కోట సత్యనారాయణ, దొండపాటి శ్రీనివాసరావు, బండే వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.


కోడూరులో సంబరాలు చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

శవరాజకీయాలు మానుకోవాలి

మచిలీపట్నం టౌన్ : వృద్ధులకు పింఛన్లు ఇవ్వడంలో సీఎం జగన్‌రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ధ్వజమెత్తారు. అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖజానాలో నిధులు లేక పింఛన్లు ఇవ్వలేమని మంత్రులు చెప్పారని, అయితే చంద్రబాబు అడ్డుపడటం వల్ల పింఛన్లు ఆగిపోయాయని దుష్ప్రచారం చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీడీపీ నాయకుడు దిలీప్‌కుమార్ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా,టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని అవనిగడ్డ మండల తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. మండలి బుద్ధప్రసాద్ కార్యాలయంలో టీడీపీ నాయకులు గురువారం విలేకరులతో మాట్లాడారు. పింఛను సొమ్ము కాంట్రాక్టర్లకు దోచిపెట్టి ఒకటో తేదీన పెన్షన్లు పంపిణీ చేయనివ్వకుండా మూడు రోజుల పాటు వాయిదా వేసి అవ్వా తాతలను జగన్ మోహన్‌రెడ్డి పెట్టిన ఇబ్బందులను ప్రజలు గమనించారన్నారు. సచివాలయాల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తామని కలెక్టర్లు, ఎంపీడీవోలు చెప్పినప్పటికీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అంగీకరించకుండా సచివాలయాల వద్దకే పింఛన్ కోసం రావాలని ఆదేశాలు జారీ చేయటంతో ఎండల్లో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పెనమలూరులో బుధవారం ఉదయం పింఛన్ కోసం వెళ్లిడబ్బు రాలేదని తెలుసుకుని వెనక్కి వచ్చిన వృద్ధురాలు చనిపోతే శవ రాజకీయాలు చేసేందుకు జోగి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నించారన్నారు. దీనిని లబ్ధిదారులు తిప్పి కొట్టడంతో తోక ముడిచారన్నారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, బచ్చు రఘునాథ్, యలవర్తి చిన్నా, షేక్ బాబావలి, కొల్లూరి ఇమ్మానియేలు, పరిమిశెట్టి బాబు, షైలా హరిబాబు, జనసేన నేత కొట్టి గంగాధర్, అడపా గంగాధర్ పాల్గొన్నారు.



వల్లభనేని బాలశౌరి పర్యటన నేడు

● విజయవంతం చేయాలి : అనుదీప్

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం ఎంపీ, జనసేన పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి శుక్రవారం నగరంలో పర్యటిస్తారని బాలశౌరి కుమారుడు వల్లభనేని అనుదీప్ గురువారం తెలిపారు. మచిలీపట్నం జనసేన అసెంబ్లీ నియోజక వర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలశౌరి శుక్రవారం 4 గంటలకు మచిలీపట్నం మూడు స్థంభాలసెంటర్‌కు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి నగరంలోని వివిధ కూడలి ప్రాంతాల మీదుగా ర్యాలీగా నాగపోతురావు సెంటర్‌లోని మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ నియోజక వర్గ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుంటారని తెలిపారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ నాయకత్వంలో నిర్వహించే ర్యాలీలో టీడీపీ , జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు. బాలశౌరి పర్య టనను విజయవంతం చేయాలన్నారు. కార్యాలయం వద్ద నాయకులు కార్యకర్తలతో సమావేశం జరుగుతుందన్నారు. జనసేన నాయకులు గడ్డం రాజు, పినిశెట్టి వేణు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కొల్లు రవీంద్ర, కొనకళ్ళ నారాయణరావు, బండి రామకృష్ణలు వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

వెండి పళ్లెం సమర్పణ

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గ్రామానికి చెందిన బాల సుబ్రహ్మణ్యే శ్వరరావు - షాలిని దంపతులు రూ.55 వేల విలువ గల వెండి పళ్లెం సమర్పించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చల్లపల్లి : పురిటిగడ్డ శివారు నిమ్మగడ్డలో ఎం.వెంకటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావులకు చెందిన రెండు వేర్వేరు కోళ్ల ఫారాలలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

పెడన : బల్లి మూల సెంటర్‌లో వాహనాల తనిఖీ సందర్భంగా ఉరిమికి చెందిన వాసన నాగ రాజు నుంచి రూ. 80 వేలు, బంటుమిల్లి మండలం నాగేశ్వరపుపేటకు చెందిన జగదీష్‌కుమార్ నుంచి రూ. 3.88 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వార్షికోత్సవ విజేతలకు బహుమతుల ప్రదానం



గుడ్లవల్లేరు, ఏప్రిల్ 4 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా, సాహితీ విభాగాల్లో పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం గురువారం కళాశాలలో జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. జేఎన్‌టీయూ నిర్వహించిన పోటీల్లో చాంపియన్ షిప్ సాధించిన బాలికలకు పతకాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, ఎం.ఆర్.సి హెచ్ శాస్త్రి, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.నవీంద్రబాబు, వార్షికోత్సవ కో-ఆర్డినేటర్ సిహెచ్ సురేష్ బాబు, లిటరరీ, కల్చరల్ కోఆర్డినేటర్ జె.రంగబాబు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివశంకర్, క్రీడాకారులు సయద్ బాజీ, సుష్మా తదితరులు పాల్గొన్నారు.



ఏఎన్నార్ విద్యార్థులు 15 మంది ఉద్యోగాలకు ఎంపిక

గుడివాడ : అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో శ్రీచైతన్య ఈ-టెక్నోస్కూల్స్ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు 15 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జె.ఎస్ కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆర్.కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్.శివనాథ్, కెమిస్ట్రీ విభాగాధిపతి ఎం.సుభాషిణి, శ్రీచైతన్య స్కూల్స్ జోనల్ ఆఫీసర్ ఎం.అశోక్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సాయుధ దళాల కవాతు



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 4 : జిల్లాలో మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రూరల్ ఎస్సై పద్మ అన్నారు. బందరు మండలం చిన్నాపురం, గుండుపాలెం, రుద్రవరం గ్రామాల్లో గురువారం భద్రతా దళాలతో కవాతు నిర్వహించారు. పోలీసులు, సాయుధ బలగాల సిబ్బంది కవాతులో పాల్గొన్నారు.

నగరంలోని రాజకీయ వాల్‌పోస్టర్లను తొలగించండి

మచిలీపట్నం టౌన్ : ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాల్ పోస్టర్లను తొలగించాలని ఆర్డీవో, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎం.వాణి ఆదేశించారు. ఎన్నికల డీటీ సౌజన్యతో ఈ విషయమై చర్చించారు. వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. 56 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో 44 పరిష్కరించడం జరిగిందన్నారు. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, ఈలోగా అభ్యర్థులు పెట్టే ఖర్చు ఆయా పార్టీల లెక్కల్లోకి వస్తాయన్నారు. ఎన్నికల నిబంధనలు అన్ని రాజకీయ పార్టీలు పాటించాలన్నారు.

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠ



పెడన, ఏప్రిల్ 4 : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. పండితులు వేదమంత్రాలు పఠిస్తుండగా బ్రహ్మశ్రీ స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో మహాగణపతి, కన్యకా పరమేశ్వరీ దేవి, వేంకటేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరీదేవి, మహిషాసురమర్ధనీదేవి విగ్రహాలను పునః ప్రతిష్ఠించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా నేతృత్వంలో జరిగిన విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవంలో ఆర్యవైశ్య ప్రముఖుడు తమ్మన సుబ్బారావు, కొల్లూరి రాధాకృష్ణ, తాడేపల్లి కృష్ణప్రసాద్, మామిడి ప్రసాద్, కొత్త మురళీకృష్ణ, కొల్లూరి మంజులత, కొమ్మూరి విజయదుర్గ, మామిడి సావిత్రి, కొల్లూరి రా జా, ఆత్మకూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలోకి దూకి యువకుడి ఆత్మహత్య

కోడూరు : కృష్ణానదిలోకి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉల్లిపాలెం - భవానిపురం వారధి వద్ద చోటు చేసుకుంది. అవనిగడ్డ సీఐ త్రినాథ్ తెలిపిన వివరాలు ప్రకారం గుడివాడకు చెందిన చిన్న శంకరరావు (33) బుధవారం రాత్రి ఉల్లిపాలెం - భవానిపురం వారధి వద్ద తన వాహనాన్ని చెప్పులను వదిలి కృష్ణానదిలో దూకినట్లు సమాచారం వచ్చిందని చెప్పారు. వెంటనే అప్రమత్తమై కోడూరు ఎస్ఐ పి.శిరీష ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. యువకుడి మృతదేహం ఉల్లిపాలెం వారధి సమీపంలో గురువారం గుర్తించినట్లు తెలిపారు. ఈ యువకుడు కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన పోనమాల మధుసూదనరావు మేనల్లుడుగా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కృష్ణా వర్సిటీలో జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి



మచిలీపట్నం టౌన్ : హరిత విప్లవానికి జగ్జీవన్‌రామ్ ఆద్యుడని కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ జ్ఞానమణి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా గురువారం కేయులో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి జ్ఞానమణి, రిజిస్ట్రార్ కె. శోభన్‌బాబు, ఎస్సీ, ఎస్టీ విభాగం సమన్వయకర్త శ్రావణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఫార్మసీ కళాశాల హెచ్‌వోడి మారుతి తదితరులు జగ్జీ వన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఐక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఎన్. ఫణి తెలిపారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు ఆకూరి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ కోసం వృద్ధులకు తప్పని తిప్పలు

కూచిపూడి, ఏప్రిల్ 4 : పింఛన్ తీసుకునేందుకు రెండో రోజు కూడా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంటి వద్దనే పింఛన్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవటంతో కిలోమీటర్ల దూరం నడిచి సచివాలయానికి వెళ్లి పడిగాపులు పడి పెన్షన్లు పొందాల్సి వచ్చింది. మొవ్వ, చినముత్తేవి గ్రామాల్లో రెండో అంతస్థులో ఉన్న సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ జరగటంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బార్లపూడి సచివాలయానికి రావాల్సి రావటంతో వృద్ధుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పెన్షన్ ప్రక్రియలో అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవటం వృద్ధులకు ప్రాణసంకటంగా మారింది. **తోట్లవల్లూరు :** కృష్ణానదిపాయల మధ్య ఉన్న లంక గ్రామాల్లోని ప్రజలు ఇబ్బంది పడకుండా సిబ్బంది వెళ్లి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి కోరారు.

85 శాతం పెన్షన్ల పంపిణీ

పామర్రు : గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు సామాజిక పెన్షన్ల పంపిణీని వేగవంతం చేశారు. మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లో గురువారం సాయంత్రానికి 85 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో భారతి తెలిపారు. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీడ కోసం షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు మజ్జిగ, తాగునీటి సౌకర్యం కల్పించారు. అవసరమైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం ఏఎన్ఎంల ద్వారా అందించారు. అనారోగ్య బాధితులు, రాలేని వృద్ధులకు ఇంటివద్దే సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేస్తారని ఆమె చెప్పారు. **పెడన :** పట్టణంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో మొత్తం 4550 మంది పింఛను దారులుండగా గురువారం సాయంత్రానికి 3657 (80.37) శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

చల్లపల్లి : ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామమని తహసీల్దార్ బి.సుమతి హెచ్చరించారు. తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. బుధవారం రాత్రి చల్లపల్లి మీదుగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అడ్డుకున్నట్లు చెప్పారు. రెండు టిప్పర్లకు రూ.50 వేల చొప్పున జరిమానా విధించినట్ల తెలిపారు. నడకుదురు వద్ద ఎనిమిది ఎడ్ల బళ్లకు రూ.రెండు వేల చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో చల్లపల్లి ఎస్సై సిహెచ్.చిన్నబాబు, ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

34 మంది వలంటీర్ల రాజీనామా

పెడన రూరల్ : మండలంలోని పలువురు వలంటీర్లు రాజానీమా బాట పట్టారు. మండలంలో 224 మంది వలంటీర్లు పనిచేస్తుండగా గురివిందగుంట, ముచ్చర్ల, కొప్పల్లి, బల్లిపర్రు గ్రామాలకు చెందిన 34 మంది నుంచి రాజీనామా పత్రాలు అందాయని ఎంపీడీవో రెడ్డియ్య తెలిపారు.